క్లుప్తంగా

80 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు



దుత్తలూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మొలక దశలోని శనగ పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామని ఏఓ ఎస్ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన దెబ్బతిన్న శనగ పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు శనగ పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు తిరిగి విత్తుకునేందుకు 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నష్టపోయిన రైతులు రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదిస్తే దెబ్బతిన్న పంటను పరిశీలించి పంపిణీ చేస్తారని తెలిపారు.

జిల్లా జూడో అడహాక్ కమిటీ ఎన్నిక



కావలి: జిల్లా జూడో అడహాక్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కావలిలో జరిగిన జూడో అసోసియేషన్ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడిగా పులిచెర్ల సురేష్, అధ్యక్షుడిగా గుడిపల్లి మురళి, ఉపాధ్యక్షుడిగా తుళ్లూరు సురేష్, సహాయ కార్యదర్శిగా గుడిపల్లి శ్రీనును ఎన్నుకున్నారు. ఏపీ జూడో అసోసియేషన్ సీఈఓ నమ్మిశెట్టి వెంకట్, ఉపాధ్యక్షుడు ఎస్కే ఖాజామస్తాన్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పీఈటీలు జూడోలో మెళకువలు నేర్పించి మంచి క్రీడాకారులను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జూడో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సుస్థిర ఆర్థికాభివృద్ధిపై ముగిసిన శిక్షణ



వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధనకు అవసరమైన ప్రణాళికల తయారీపై మండలాధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండ్రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు, ఈఓపీఆర్డీ నాగూర్‌వలి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులతో అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.


మహిళ మెడలోని చైను అపహరణ

ఉదయగిరి: మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ పరిధిలోని మిట్టపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం నడిచి వెళ్తున్న జీ పద్మ అనే మహిళ మెడలోని బంగారు సరుడును బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అదే వైపు కారులో వస్తున్న ఓ వ్యక్తి దొంగలను వెంబడించారు. దాసరపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో బైక్‌ను వదిలేసి దొంగలు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: 133 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా మున్సిపల్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ ఎన్ లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం



సంగం: స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రత పూజలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. దుగ్గి పవన్‌కుమార్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

14 మద్యం బాటిళ్ల స్వాధీనం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లిలో విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మద్యం అనధికారికంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తి వద్ద 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వర్షం పడితే నరకమే!

ఏఎస్‌పేటలో హైస్కూల్ రోడ్డులో జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బీసీ వసతిగృహం, ప్రాథమి ఆరోగ్యం కేంద్రం ఉన్నాయి. వర్షం పడితే రోడ్డు రొచ్చురొచ్చుగా మారుతుండడంతో విద్యార్థులతో పాటు రోగులు రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నారు. అనుమసముద్రం గ్రామస్తులు సైతం మండల కేంద్రానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన అనుమసముద్రంపేటలోని హైస్కూల్‌రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, బీసీ వసతిగృహం, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఉన్నాయి. ఉన్నత పాఠశాలలో 200 మంది, ప్రాథమిక పాఠశాలలో 50 మంది, బీసీ వసతిగృహంలో 80 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే ప్రభుత్వవైద్యశాలకు నిత్యం 80 మంది వరకు రోగులు వస్తుంటారు. అలాగే మసీదుకు భక్తులు ప్రార్థనలు చేసేందుకు వస్తుంటారు. ఏఎస్‌పేటకు చేరుకునేందుకు దగ్గర మార్గం కావడంతో అనుమసముద్రం గ్రామస్తులు సైతం ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి కీలకమైన హైస్కూల్ రోడ్డు వర్షాలకు రొచ్చురొచ్చుగా మారింది. దీనికి తోడు గతంలో ఎర్రమట్టి తోలడంతో అడుగేస్తే జారుతోంది. దీంతో విద్యార్థులు, రోగులు రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నారు. మెయిన్‌రోడ్డు నుంచి కిలో మీటర్ మేర హైస్కూల్ రోడ్డు ఉంది. గతంలో ఉర్దూ పాఠశాల వరకు సిమెంట్‌రోడ్డును నిర్మించారు. అక్కడి నుంచి మట్టిరోడ్డును నిర్మించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్డు దారుణంగా తయారవడంతో విద్యార్థులు జారిపడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. మరోవైపు ఈ మార్గంలో వెళ్లలేక రోగులు ఊరుచుట్టూ తిరిగి ఎస్టీ కాలనీ మీదుగా పీహెచ్‌సీకి చేరుకుంటున్నారు. రోడ్డు సమస్యను పలుమార్లు పంచాయతీ పాలకులు, మండలాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.



వర్షాలకు అధ్వానంగా తయారైన హైస్కూల్ రోడ్డు



నడిచేందుకు వీల్లేకుండా బురదతో రోడ్డు

భయమేస్తోంది



వర్షం పడితే హైస్కూల్ రోడ్డు రొచ్చురొచ్చుగా మారి అడుగేస్తే జారుతోంది. ఎక్కడ జారిపడిపోతామోనని భయమేస్తోంది. దీంతో పాఠశాలకు ఊరుచుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి హైస్కూల్ రోడ్డును బాగు చేయాలి.

–జీ హరిబాబు, 9వ తరగతి

జారి పడిపోతున్నాం



వర్షం పడితే హైస్కూల్‌కు వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. హైస్కూల్ రోడ్డు రొచ్చురొచ్చుగా మారి జారుతుండడంతో పడిపోయి గాయాలపాలవుతున్నాం. బురదతో దుస్తులు సైతం మురికిగా తయారవుతున్నాయి.

– ప్రదీప్‌రెడ్డి, 7వ తరగతి

ఇబ్బందులు పడుతున్నాం



వర్షం పడితే హైస్కూల్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు బురదమయంగా మారి జారుతుండడంతో రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నాం. అధికారులు స్పందించి హైస్కూల్ రోడ్డును బాగు చేయాలి.

– మనిస్విని, 7వ తరగతి

ఇంధన వనరుల పొదుపును పాటించాలి

బిట్రగుంట: ఇంధన వనరుల పొదుపును ప్రతిఒక్కరూ పాటించాలని ఆర్ఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పీవీఎస్‌రెడ్డి అన్నారు. బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంధన వృథాను అరికట్టడం, శక్తి వనరులను పరిరక్షించుకోవడంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంధన వనరుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. విచ్చలవిడిగా ఇంధన, శక్తి వనరులను వినియోగిస్తే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విచ్చలవిడి వినియోగంతో ఇంధన వనరుల కొరత ఏర్పడటంతో పాటు కాలుష్యం పెరిగి ప్రకృతి వనరులకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇంధన కొరత తలెత్తితే పరిశ్రమలు, ఉపాధి కల్పనా రంగాలు కుంటుపడి నిరుద్యోగ సమస్య కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ పెట్రోల్, డీజిల్, విద్యుత్, తదితర వనరులను పొదుపు చేయడం ద్వారా ప్రకృతికి, దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూర్చిన వారవుతారని వివరించారు. వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టిప్పర్లు, జేసీబీ స్వాధీనం

అల్లూరు: మండలంలోని బట్రకాగొల్లు అటవీ ప్రాంతంలో ఉన్న మూడు టిప్పర్లు, జేసీబీని గురువారం రాత్రి స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు అల్లూరు ఎస్సై కిషోర్ బాబు తెలిపారు. ఖాళీ టిప్పర్లు కావడంతో కేసు నమోదు చేయలేదని, మైనింగ్ అధికారులకు సమాచారం అందజేశామని, వారు పరిశీలించి జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



చేజర్ల : వినతులను పరిశీలిస్తున్న ఆర్డీఓ పావని



దుత్తలూరు : వినతులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

చేజర్ల: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని తెలిపారు. మండలంలోని నాగులవెలటూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీఓ మాట్లాడారు. రైతులు విన్నవించే రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కాగా మొత్తం ఆరు అర్జీలు అందాయని తహసీల్దార్ మురళి తెలిపారు. ఆర్ఐ వెంకటేశ్వర్లు, సర్వేయర్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: మండలంలోని నందిపాడులో తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కావలి ఆర్డీఓ వంశీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు మండలంలో ఎన్ని సదస్సులు నిర్వహించారు, ఎన్ని దరఖాస్తులు అందాయి, ఎన్ని పరిష్కరించారని తహసీల్దార్‌ను ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరికుంటపాడు : మండలంలోని తొడుగుపల్లి, తూర్పుపాళెం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో డిప్యూటి తహసీల్దార్ చెంచయ్య పాల్గొన్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ఏడు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. వీఆర్వోలు శ్రీనివాసులు, ఆదినారాయణ, సర్వేయరు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్ల, గొల్లపల్లి గ్రామాల్లో తహసీల్దార్ సుధీర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి 11 వినతులు అందాయని తహసీల్దార్ తెలిపారు. డీటీ స్వరూప్, వీఆర్వోలు హరిబాబు, చిన్నమ్మ పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక సచివాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 57 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు.

అన్నదాతకు అండగా ర్యాలీకి తరలి వెళ్లిన నాయకులు



ర్యాలీలో పాల్గొన్న ఆత్మకూరు నాయకులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో శుక్రవారం నిర్వహించిన రైతులకు అండగా ర్యాలీకి ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని మండలాల నుంచి నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లి పాల్గొన్నారు. ఆత్మకూరుకు చెందిన ఉల్సా పెంచలయ్య, వాశిలి సర్పంచ్ చెలిక రమాహరిబాబు, ఏఎస్‌పేట ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, సంగం, మర్రిపాడు మండలాల నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, జీ శ్రీనివాసులు నాయుడు, మాజీ జెడ్పీటీసీ తుంగా ఇందూధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మానికల చందన్‌కుమార్, శివ, అంజి, మహేష్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో శుక్రవారం నిర్వహించిన రైతులకు అండగా ర్యాలీకి జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ర్యాలీలో నాయకులు పాలూరు కొండారెడ్డి, బొల్లినేని వెంకట సత్యనారాయణ, మల్లు రియాజ్‌రెడ్డి, షద్దా రమణారెడ్డి, శ్రీనివాసులు, వేమనారాయణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఆత్మకూరురూరల్: మండలంలోని ముస్తాపురంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి క్షేత్రస్థాయిలో పంటల సాగుపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. మెంటార్ సుబ్బమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. అనంతరం బీజామృతం, ఘన జీవామృతం, విత్తన గుళికలను వేరుచేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు కోటేశ్వరరావు, చంద్ర, శ్రీనివాస్‌తేజ్, సునీల్, వెంకట లక్ష్మీ, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సాంబశివ ట్రస్టు సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న గుండ్రా సతీష్‌రెడ్డి

ఆత్మకూరు: సాంబశివ చారిటబుల్ ట్రస్టు ద్వారా కంచి పరమేశ్వరరెడ్డి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని డీఆర్డీఏ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి కొనియాడారు. ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సాంబశివ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 600 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కంచి పరమేశ్వరరెడ్డితో సతీష్‌రెడ్డి శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరుకు చెందిన పరమేశ్వరరెడ్డి మూడు దశాబ్దాలకుపైగా ఇతర ప్రాంతాల్లో వ్యాపారాలు చేసి ఆర్థికంగా స్థిర పడ్డారన్నారు. సొంత ఊరికి ఏదైనా చేయాలన్న తపనతో సాంబశివ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేయడం, మృతుల కుటుంబాలకు నగదు సాయం అందజేయడం, కైలాస రథాలు, ఎలక్ట్రికల్ శవపేటికల ఏర్పాటు, పదోతరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయడం, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పించడం, మినరల్ వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు, తదితర సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆదర్శనీయమన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ స్కాన్, డయాలసిస్ యూనిట్లు, తదితర అదనపు సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రతిఒక్కరూ తమ సొంత ఊరిని మరిచిపోకుండా అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అనంతరం సతీష్‌రెడ్డి, కంచి పరమేశ్వరరెడ్డిని పలువురు ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ నిర్వాహకులు కేవీ శేషారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, సోమవరపు సుబ్బరాయుడు, యానాదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో వ్యక్తికి తీవ్రగాయాలు

అనుమసముద్రంపేట: మండలంలోని అనుమసముద్రంలో రెండు కుటుంబాల మధ్యన భూ వివాదమై శుక్రవారం చోటు చేసుకున్న ఘర్షణలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై సైదులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బొద్దుకూరు ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి సోదరులు. ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి కుమారుల మధ్యన గత కొద్దిరోజులుగా భూ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం పొలంలో పనులు చేసుకునే క్రమంలో ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి కుమారులు అశోక్, వివేక నడుమ చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. ప్రసాద్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

బెల్టుషాపులపై ఉక్కుపాదం



ఉదయగిరి: జిల్లాలో ఎక్కడైనా అనధికారికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్ హెచ్చరించారు. ఉదయగిరి ఎక్సైజ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి ఎక్సైజ్ సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరి ఎక్సైజ్ పరిధిలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు జరిపామన్నారు. ఈ దాడుల్లో దుత్తలూరు మండలం నందిపాడులో వెంగయ్య, వేణుగోపాల్ వద్ద 190 సీసాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. మర్రిపాడు మండలం డీసీపల్లిలో అక్రమంగా మద్యం కలిగివున్న సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఉదయగిరి మండలం గుడినరవలో బెల్టుషాపు నిర్వహిస్తున్న మాల కొండయ్యను అదుపులోకి తీసుకుని 89 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక వ్యక్తి మూడు కంటే ఎక్కువ మద్యం సీసాలు కలిగి ఉండరాదన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తుంటే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇస్తే వారి పేర్లు రహస్యంగా ఉంచుతామన్నారు. ఏఈఎస్‌లు జగదీశ్వర్‌రెడ్డి, రమేష్, సీఐ లక్ష్మీస్వామి, ఎస్సై దీప్తి కరంత్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులను నమ్మించి నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన 'అన్నదాతకు అండగా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కావలిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సూపర్‌సిక్స్ హామీలతో ప్రజలను మభ్యపెట్టారని, అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలవగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏటా రైతుభరోసా కింద రైతులకు పెట్టుబడి సాయం అందజేసిందని గుర్తుచేశారు. పంటలకు మద్దతు ధరలను అందించిందని వివరించారు. ఉచిత పంటల బీమాను అమలు చేసిందని తెలిపారు. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందజేసిందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు సాయం అందుతుందని రైతులు ఆశించారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రంలోని రైతులకు రూ10,718 కోట్లు చెల్లించాల్సి ఉండగా, బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసిందని తెలిపారు. మరోవైపు పంటల బీమా ప్రీమియం బకాయిలను ఎగ్గొట్టి రైతులకు దక్కాల్సిన రూ.1,385 కోట్ల పంటల బీమా పరిహారాన్ని అందకుండా చేసిందన్నారు. ఆరుగాలం పండించిన పంటలను కొనుగోలు చేసేవారు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఏకంగా 70 మంది వరకు రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడగా ఏ ఒక్కరికీ ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్నెళ్లలోనే రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వ తీరుతో దిక్కుతోచన స్థితిని ఎదుర్కొంటున్న రైతులకు వైఎస్ జగన్ అండగా నిలిచారని, ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. ఈ మేరకు రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యంలో తేమ శాతం లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని, తక్షణమే ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, రైతులపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చీటింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం

కావలి: పట్టణంలోని ముసునూరుకు చెందిన నిమ్మకాయల మదన్‌కుమార్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5లక్షలు నగదు తీసుకుని బాపట్ల జిల్లా అద్దంకి మండలం మోడేపల్లికి చెందిన భీమినేని హరికృష్ణ మోసం చేసిన కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హరికృష్ణ గుంటూరులో నివాసం ఉంటూ ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్నాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అదే క్రమంలో ముసునూరుకు చెందిన మదన్‌కుమార్‌ను పరిచయం చేసుకున్న హరికృష్ణ ఉద్యోగం ఇప్పిస్తానని దశల వారీగా రూ.5 లక్షల వరకు నగదు వసూలు చేశాడు. ఫోన్‌పే ద్వారా రూ.3.5లక్షలు, రూ.1.5లక్షలు నగదు రూపంలో బాధితుడైన మదన్ కుమార్ నిందితుడైన హరికృష్ణకు చెల్లించాడు. ఆ తరువాత ఉద్యోగం ఊసెత్తకపోవడం, సరిగా స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన మదన్‌కుమార్ గురువారం కావలి రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఉద్యోగాల పేరుతో అమాయకులకు గాలం వేసి వసూళ్లకు పాల్పడుతున్న హరికృష్ణ వ్యవహారంపై పూర్తి స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు.

వికసించిన క్రీడా కుసుమాలు

- జాతీయస్థాయి పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు
- షాట్‌పుట్‌కు పులి రితిక
- బాస్కెట్‌బాల్‌కు తాతా అర్చన ఎంపిక



రితిక, అర్చనను అభినందిస్తున్న హెచ్ఎం ఏవీఎస్ శేషమ్మ, పీడీ షేక్ గౌసియా

కావలి: పట్టణంలోని పాత శివాలయం వద్ద ఉన్న జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తున్నారు. హెచ్ఎం ఏవీఎస్ శేషమ్మ, ఫిజికల్ డైరెక్టర్ షేక్ గౌసియాలు అందిస్తున్న ప్రోత్సాహంతో క్రీడల్లో సత్తా చాటుతున్నారు. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు పేరును తీసుకొస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి షాట్‌పుట్, బాస్కెట్‌బాల్ పోటీల్లో 9వ తరగతికి చెందిన పులి రితిక, తాతా అర్చన ప్రతిభకనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

క్రీడలపై ఆసక్తితో..

- మద్దూరుపాడుకు చెందిన పులి రితిక తండ్రి రాము కూలీ. తల్లి సరస్వతి ఇంటి వద్దే టిఫిన్ సెంటర్ నడుపుతోంది. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న రితిక క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకుంది. షాట్‌పుట్, బాస్కెట్‌బాల్‌లో రాణిస్తోంది. ఇటీవల ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీల్లో రితిక సత్తాచాటి రెండో స్థానంలో నిలిచింది. జనవరి 10వ తేదీ నుంచి జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ంది. అలాగే ఇటీవల పల్నాడు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లోనూ జిల్లా తరుపున పాల్గొన్నారు.
- కావలి మండలం ఆముదాలదిన్నెకు చెందిన తాతా అర్చన తండ్రి శీనయ్య రైతు. తల్లి అంకమ్మ గృహిణి. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అర్చన క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుంది. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తోంది. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభకనబర్చింది. ఆమె క్రీడా నైపుణ్యాన్ని గమనించి జూనియర్, సీనియర్ బాస్కెట్‌బాల్, జూనియర్ అథ్లెటిక్స్ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.

హెచ్ఎం, పీడీల ప్రోత్సాహంతోనే

ప్రధానోపాధ్యాయిని ఏవీఎస్ శేషమ్మ, ఫిజికల్ డైరెక్టర్ షేక్ గౌసియా ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నాం. పీడీ క్రీడాంశాల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఎక్కడ పోటీలు జరిగినా తమను వెంట పెట్టుకుని తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రులు సైతం తమకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నారు.

–పులి రితిక,తాతా అర్చన